క్లుప్తంగా

నూకాలమ్మవారికి వెండి సమర్పణ



వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: శ్రీ చక్ర సహిత శ్రీనూకాలమ్మ వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి రజత (వెండి) వస్త్ర తయారీకి వేముల సుజాత, వీరభద్రరావు దంపతులు 10 తులాలు, భీమిరెడ్డి జోగిబాబు, పార్వతి కుటుంబ సభ్యులు 9 తులాలు, సింగంపల్లి శ్రీనివాసరావు, రమణ దంపతులు 5 తులాల వెండి సమర్పించినట్టు డాక్టర్ రాజాన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, కారింగుల రామకృష్ణ, రొంగల నాగేశ్వరావు, చిట్లూరి సర్వేశ్వరరావు, పోలుపర్తి రాము, పట్టణ ప్రముఖులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవాబృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న.. తెలుగువారికి గర్వకారణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం తెలుగు ప్రజలకే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతో పాటు ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేసిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. సకలభాషా కోవిదునిగా, గొప్ప రచయిత అయిన పీవీకి భారతరత్న పురస్కారం ప్రకటించడం సముచిత నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు ప్రకటించారు.

23న దుకాణాల లీజుకు వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గడియార స్తంభం రోడ్డులోని దేవదాయ శాఖ పరిధిలో ఉన్న శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి చెందిన రెండు దుకాణాల లీజు నిమిత్తం ఈ నెల 23న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్ వి.నాగమునేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కుండీ సెంటర్ వద్ద ఉన్న శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజం కాంప్లెక్స్‌లో ఉదయం 11 గంటలకు, 11.30 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక్కో దుకాణానికి రూ.10 వేలు దరావతు చెల్లించాలని, నెలసరి లైసెన్స్ ఫీజు చెల్లించే పద్ధతిపై మూడేళ్ల కాలపరిమితికి లీజుకు కేటాయిస్తామని తెలిపారు. పాట పాడుకున్నవారు 12 నెలల లైసెన్స్ ఫీజు అడ్వాన్సుగా చెల్లించాలని పేర్కొన్నారు. హిందువులు మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

16న బంద్, సమ్మెను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్ – పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు, కార్మిక, కౌలురైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్త జిల్లా సమావేశం బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ఢిల్లీ రైతాంగాన్ని, ప్రజలను మోదీ ప్రభుత్వం మోసగించిందన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించి రోజుకి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. బీజేపీ అనుసరిస్తోన్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, బద్దా వెంకట్రావు, నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్, తలారి ప్రకాష్, కె.కృష్ణమాచార్యులు, ఆర్ శ్రీనివాస డాంగే, కేఎస్‌కే బాషా, కె.విజయలక్ష్మి, వెజ్జు శ్రీరామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లుగా వైఎస్సార్ ఆసరా పేరుతో సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ఏలూరు నియోజకవర్గ పరిధిలో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ పూర్తి చేశారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొంటారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీఓ అద్దయ్య



ఎన్నికల విధులపై సదస్సు నిర్వహిస్తున్న ఆర్డీఓ అద్దయ్య



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: ఎన్నికల కమిషన్ సూచనలు, ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహించవద్దని ఆర్డీఓ కె.అద్దయ్య అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలోని రెవెన్యూ, సెక్టోరల్, పోలీసు అధికారులతో ఎన్నికల విధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల సన్నద్ధతపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ సూచించిన హ్యాండ్ బుక్‌లోని నిబంధనలు, మార్గదర్శకాలను తప్పక అనుసరించాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చూడాలని, ర్యాంపు ఏర్పాటు, మరుగుదొడ్లు, నీటి వసతి ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సదుపాయం కల్పించాలని, ఎలక్ట్రిసిటీ సంబంధిత కనెక్టివిటీ సక్రమంగా ఉండాలని, ఫ్యాన్, రెండు డోర్‌లు, వెలుతురు ఉండేలా, ఫర్నీచర్ తగినంత ఉండేలా చూడాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేయాలని, తద్వారా ఆయా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, అవసరమైన చోట వీడియోగ్రఫీ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. చింతలపూడి ఏఎంసీలో తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేస్తామని, అక్కడి నుంచే ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తారని చెప్పారు. ఓట్ల లెక్కింపు ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉంటుందన్నారు. తెలంగాణ సరిహద్దు చెక్ పోస్టులపైనా ఆర్డీఓ సమీక్షించారు. డీఎస్పీ ఎం ధనుంజయుడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి తహసీల్దార్‌లు కె.స్లీవజోజి, గోపాలకృష్ణ, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, సీఐ పి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహరించండి

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించాలని తహసీల్దార్ స్లీవజోజి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఎంపీడీఓ కె.విజయప్రసాద్, సీఐ పి.రాజేష్‌లు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలకు ప్రాంతీయ పార్టీలు సహకరించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో అధికారులు నిష్పక్షపాతంగా, నిజాయితీ వ్యవహరించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటిపై నిఘా ఉంచాలని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నా, పోలింగ్ కేంద్రానికి రాలేని పరిస్థితుల్లో ఉన్న వారు ఇంటి వద్దే ఓటరు వేసే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా వారి శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. వారి వంతుగా ఓటర్లను చైతన్య పరిచి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సీహెచ్ అచ్చిరాజు, రావూరి కృష్ణ, షేక్ పీరూ, పసల సూర్యారావు, వీరవల్లి సోమేశ్వరరావు, నులకాని నాగరాజు, కిరణ్, రాజ్‌కుమార్, జంగారెడ్డిగూడెం, లక్కవరం ఎస్సైలు జ్యోతీబాస్, పి.సుధీలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని దేవులపల్లిలోని ఒక రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైరు చోరీకి గురైంది. సింహాద్రి రవి శుక్రవారం సాయంత్రం పొలం వెళ్లి చేలకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేయగా పనిచేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేసినట్టు గుర్తించారు. రవి ఇచ్చిన సమాచారంతో లక్కవరం ఏఈ జోసఫ్ ఘటనా స్థలిలో పరిశీలించి, చోరీ ఘటనపై లక్కవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



బయ్యనగూడెంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న దృశ్యం



టి.నరసాపురంలో చిన్నారులకు ఆల్‌బెండాజోల్ మాత్రను వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొయ్యలగూడెం: నులిపురుగుల నివారణతోనే పిల్లల్లో శారీరక మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి జె.సురేష్ అన్నారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని ఎంవీఆర్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ విద్యార్థులకు అవగాహన కల్పించి, నులి పురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల ఎదుగుదల లోపిస్తుందని, శారీరక, మానసిక ఆరోగ్యం బలహీన పడుతుందని తెలిపారు. నులి పురుగుల వల్ల పిల్లలు రక్తహీనతకు గురవుతారని అన్నారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలు ఆల్బెండజాల్ మాత్రలు ఏడాదికి రెండు సార్లు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంతలక్ష్మి, వైద్యాధికారులు సత్యనారాయణ, గీతా రాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీకు

టి.నరసాపురం: మండలంలోని చిన్నారులకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది నులిపురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో రక్తహీనత, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నులిపురుగు నివారణ కోసం మాత్రలు పంపిణీ చేశామని మండల వైద్యాధికారి జె.కల్పనారాణి తెలిపారు. 19 ఏళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు 6,500 ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశామనానరు.

హైస్కూళ్లను సందర్శించిన డీఈఓ



కొయ్యలగూడెంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈఓ అబ్రహాం

కొయ్యలగూడెం: పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీఈఓ ఎస్ అబ్రహాం ఉపాధ్యాయులను ఆదేశించారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురం, పరింపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన డీవైఈఓ మడకం రామన్న దొరతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, పాఠ్యాంశాల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న పరీక్షల పేపర్లను, స్టడీ మెటీరియల్‌ను పరిశీలించారు. విద్యార్థులంతా శ్రద్ధగా చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. కన్నాపురం హైస్కూల్‌లో మిడ్డే మీల్ హాజరు పట్టీని పరిశీలించారు. విద్యార్థులంతా భోజనంచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వెట్టి చాకిరీ వ్యతిరేక దినోత్సవం



జంగారెడ్డిగూడెంలో వెట్టిచాకిరీ వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అసంఘటిత రంగాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడం నేరమని, కనీస వేతనం, పని గంటలు తప్పనిసరిగా అమలు చేయాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వెట్టిచాకిరీ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలను మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యులు సందర్శించారు. ఇటుక బట్టీ పనివార్లతో మాట్లాడారు. కార్మికులకు అందాల్సిన సౌకర్యాలను వివరించి, వాటిని అందించాలని యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి, న్యాయవాదులు మేకల రామ్మోహనరావు, మాదేపల్లి క్రాంతి కుమార్, పల్లి పెద్దిరాజు, తొర్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలి



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దాసరి రాము

కొయ్యలగూడెం: తెలుగు రాష్ట్రాల్లో బడుగు బలహీన వర్గాల వారు రాజ్యాధికారం చేపట్టేలా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ భారతదేశ కాపు, తెలగ ఒంటరి బలిజ సామాజిక వర్గాల జేఏసీ కన్వీనర్ దాసరి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం కొయ్యలగూడెంలోని కాపు సంఘం నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం నివాసంలో స్థానిక కాపు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఓటుకు నోటు పరిపాటిగా మారిపోయిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు మూడు కులాల నాయకులే రాజ్యాధికారం చేపడుతున్నారని, మార్పు కోసం బడుగులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. అనంతరం ఆంధ్రా బ్యాంక్ సమీపంలోని వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మలిశెట్టి కేశుబాబు, జీవీ రామ్మోహనరావు, అడపా సత్యనారాయణ, విగ్గిన సూరిబాబు, సంకు మధు, పారేపల్లి శ్రీను, యాతం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఫొటో, వీడియో మిక్సింగ్ యూనియన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ఫొటో, వీడియో గ్రాఫర్లు, మిక్సింగ్ యూనిట్ సభ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జంగారెడ్డిగూడెం ఫొటో, వీడియో, మిక్సింగ్ యూనిట్ల యూనియన్ అధ్యక్షుడు కానుమూరి సోమరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ఫొటో, వీడియో, మిక్సింగ్ యూనిట్ యూనియన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సోమరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. సబ్సిడీపై ఫొటో, వీడియో కెమెరాలు, డెస్క్ టాప్‌లు అందించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులకు కుటుంబ భరోసా, పోస్టల్ ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి సంఘ ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు సూరిబాబు, కోశాధికారి బాలు, కాగితాల శ్రీను, నాగసూరి బాల సుబ్రహ్మణ్యం, చింతపల్లి శ్రీను, ఆర్‌జీబీ కలర్ ల్యాబ్, శ్రీదేవి ల్యాబ్ యాజమాన్యం, డివిజన్‌లోని ఫొటో, వీడియో గ్రాఫర్లు, మిక్సింగ్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

- టీడీపీ, జనసేన నేతలకు వైఎస్సార్ సీపీ నేతల సవాల్
- ఎమ్మెల్యే నాని నేతృత్వంలో రూ.40 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- ఇడా చైర్మన్ బొద్దాని, క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర



ఫిల్‌హౌస్‌పేట రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇడా చైర్మన్ శ్రీనివాస్,క్లస్టర్–1 అధ్యక్షుడు చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఏలూరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఏలూరు నగరంలో అభివృద్ధి లేదంటూ టీడీపీ, జనసేన నేతలు కొద్ది రోజుల క్రితం ఆయా ప్రాంతాల్లో హడావిడి చేసి అసత్య ప్రచారాన్ని చేయడంపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేయడం తెలియని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు కుటిల రాజకీయాలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఏలూరు వన్‌టౌన్ ఫిల్‌హౌస్‌పేట ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఇటీవల ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని శంకుస్థాపన చేసిన ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నేతలు పర్యటించి అక్కడ నుండే ప్రతిపక్షాలకు ధీటైన సమాధానం చెప్పారు.

రూ.1.50 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం

ఏలూరు వన్‌టౌన్‌లోని ఫిల్‌హౌస్ ప్రధాన రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మిస్తోన్న రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ నేతలు పర్యవేక్షించారు. టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేశారు. తూర్పువీధి వేణుగోపాల స్వామి గుడి ప్రాంతంలో రూ.90 లక్షలతో నిర్మిస్తోన్న రోడ్డు నిర్మాణ పనులు, ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తోన్న రోడ్డు పనులను నేతలు పరిశీలించారు.

బహిరంగ చర్చకు సిద్ధమా

ఎమ్మెల్యే నాని నగరంలో గత ఐదేళ్లుగా చేస్తోన్న అభివృద్ధి పనులపై ప్రతిపక్ష నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని పార్టీ క్లస్టర్–1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్ సవాల్ విసిరారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే నాని నగరంలోని ప్రతి డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 కోట్లు, ఏలూరు నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ నిధులు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారని వివరించారు. ప్రతి డివిజన్‌లోనూ రూ.కోటిన్నర నుంచి రూ.3 కోట్ల మేర అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి కాలనీలోనూ సీసీ రోడ్లు నిర్మాణం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంకధారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాస్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వైఎన్‌వీ శివరావు, జేసీఎస్ ఏలూరు క్లస్టర్–1 కన్వీనర్ మోటమర్రి సదానందం, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్ తదితరులున్నారు.

అంజుమన్ సంస్థలో లుకలుకలు



అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ భవనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. నగరంలో అనేక ఆస్తులు, ఆదాయం ఉన్న ఈ సంస్థపై పట్టుకోసం ముస్లింలలోని కొన్ని వర్గాలు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి. గతంలో ఈ సంస్థ పాలక వర్గం పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరో వర్గం కోర్టుకెళ్లి ఎన్నికలు నిర్వహించేలా ఆర్డర్ తెచ్చుకుంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం కూడా పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరోసారి ఆ సంస్థలో వర్గపోరు ప్రారంభమైంది. ఈ పాలకవర్గం గడువు రెండేళ్ల క్రితమే ముగిసిందని, సంస్థ బైలా ప్రకారం ఏటా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక్క సంవత్సరం కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో మరో వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇదిలాఉండగా గతేడాది ఆగస్టులో సర్వసభ్య సమావేశం నిర్వహించి అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీ ఎన్నికైన వెంటనే జీవితకాల సభ్యత్వాలు తీసుకోవాలని, ఎన్నికల అధికారిని నియమించి రెండు నెలల వ్యవధిలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తీర్మానం చేశారు. అయితే అడ్‌హక్ కమిటీ సైతం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడంతో పాలకవర్గంలోని 16 మంది సభ్యులు ఇటీవల కోర్టులో కేసు వేశారు. ఈ వ్యవహారంపై రెండు వర్గాల నాయకులూ ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేసుకుంటూ సమస్యను మరింత క్లిష్టతరం చేసుకుంటున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా శనివారం ఈ సంస్థ అడ్‌హక్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దీనిపై కమిటీ వ్యతిరేక వర్గం అడ్‌హక్ కమిటీకి సర్వసభ్య సమావేశం నిర్వహించే అధికారం లేదని, ఎన్నికలను సక్రమంగా, సకాలంలో నిర్వహించడానికి మాత్రమే అధికారం ఉందని చెబుతోంది. అయినప్పటికీ శనివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరై అమీతుమీ తేల్చుకోవడానికి వ్యతిరేకవర్గం సన్నద్ధమౌతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ సంస్థకు చెందిన సభ్యులు వివిధ పార్టీల్లో సభ్యులుగా ఉండడంతో శనివారం నిర్వహించే సర్వసభ్య సమావేశంలో రాజకీయ ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని ముస్లిం వర్గాలు చర్చించుకుంటున్నాయి.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని పార్వతీ పరమేశ్వరులకు పురవీధుల్లో పల్లకీ సేవ ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన పురోహితులు బ్రహ్మశ్రీ సుదర్శనం వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ మోహన్ రావు, ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితాలో తేడాలుంటే సరిచేస్తాం'

టి.నరసాపురం: ఓటరు జాబితాలో తేడాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెంలో 63, 64 పోలింగ్ బూత్‌లను ఆయన శుక్రవారం పరిశీలించారు. తుది ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు తమ ఓటు ఎక్కడుందో సంబంధిత కార్యాలయాలకు వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే తెలియజేయాలన్నారు. కాగా, పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. తేడాలను గుర్తించామని, సరిచేస్తామని తెలిపారు.

ఆశీల వేలం ఖరారు

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆశీల వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ అధ్యక్షతన రోజువారీ మార్కెట్, వారపుసంత మార్కెట్, కబేళా నిమిత్తం ఏడాది కాలానికి ఆశీల వేలం నిర్వహించారు. మార్కెట్ వేలంలో నలుగురు పాల్గొనగా, గంటా వెంకట మురళీకృష్ణ రూ.32.05 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారని కమిషనర్ తెలిపారు. మేకల కబేళా వేలం పాటలో ముగ్గురు వ్యక్తులు పోటీ పడగా, రూ.1.54 లక్షలకు సముద్రపు హరిప్రసాద్ పాడుకున్నట్టు చెప్పారు.

రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన అవసరం



జంగారెడ్డిగూడెంలో రోడ్డు భద్రత మాసోత్సవాల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని, తద్వారా సురక్షిత ప్రయాణానికి దోహదపడుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ పీవీవీ గంగాధర్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా స్థానిక బస్టాండ్ నుంచి మసీద్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధర్ మాట్లాడుతూ అలసటగా ఉన్నప్పుడు, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం సురక్షితం కాదని డ్రైవర్లకు సూచించారు. మితిమీరిన వేగం, నిబంధనలను పాటించకపోవడం నష్టదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) జి.కేశవ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) పి.వరలక్ష్మి, ఉద్యోగ సంఘాల నాయకులు, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.